'దళిత బంధు'తో మార్పునకు నాంది

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: 'దళిత బంధు'పథకం దళితుల జీవితాల్లో గొప్ప మార్పునకు నాంది పలికిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. దళితబంధు పథకం రెండో విడత అమలుకు ఆదేశాలు జారీ చేయడంపై ఆదివారం గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి దళిత సంఘాల నేతలతో కలిసి వారు క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులకు ఆర్థిక భద్రత కల్పించి సమాజంలో వారి గౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ పథకం మంచి ఫలితాలనిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి బృహత్తర పథకం లేదని కొనియాడారు. వినూత్న పథకాలతో తెలంగాణ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీల ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని మార్వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మార్వాడీలు వారికి తలపాగా ధరింపజేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అభినందనీయం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవలందించడానికి వైద్యులు ముందుకొచ్చి ఉచిత క్యాంపులను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ లింగం మాట్లాడుతూ.. ఐఎంఏ ఆధ్వర్యంలో బూర్గుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని, ఉచిత సేవలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గజ్వేల్ పట్టణానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ పెంటాచారి, నరేశ్‌బాబు, చంద్రారెడ్డి, సాయినాథ్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, సంపత్, శైలజ, సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



హుస్నాబాద్: ఇంటింటికీ కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు



అంకిరెడ్డిపల్లిలో..

హుస్నాబాద్: పట్టణంలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా శంకర్‌బాబు మాట్లాడుతూ.. సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమన్నారు. 9 సంవత్సరాల కాలంలో కేంద్రంలో ఏ ఒక్క అవినీతి జరగనివ్వకుండా అవినీతి రహిత భారత్‌కు నిరంతరం కృషి చేసిన నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తగరపు రమేశ్, రాంప్రసాద్, అరుణ్ కుమార్, కుమారస్వామి, శ్రీనివాస్, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలపై బీజేపీ మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరోనా కష్టకాలంలో ప్రజలను కాపాడుకునేందుకు ప్రధాని మోదీ చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కుడిక్యాల రాములు, రాజశేఖర్, సంతోష్, ఆంజనేయులు, అనూష్, రామస్వామి, కిషన్‌రావు, నీల సత్యం, ప్రవీణ్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయం

బెజ్జంకి(సిద్దిపేట): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం బెజ్జంకిలో ఇంటింటికీ తిరిగి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సుపరిపాలనకు ప్రపంచ దేశాలు అబ్బురపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దోనె అశోక్, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి శ్రీనివాస్, రవి, వెంకటేశం, సాగర్, రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నియామకం



సాయికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్

తొగుట(దుబ్బాక): ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడిగా మండలంలోని తుక్కాపూర్‌కు చెందిన ఉల్లేంగల సాయికుమార్‌ను నియమించారు. ఈ మేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో నియామకపత్రం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన మండలి రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దమ్మిగారి కనకయ్య, యువత విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు స్వామి, ధర్మ, శ్రీనివాస్, యాదగిరి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మూడోరోజుకు చేరిన భూనిర్వాసితుల దీక్ష



దీక్షలో కూర్చున్న భూనిర్వాసితులు

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన తమ భూమికి చట్టబద్ధమైన పరిహారం అందజేయాలనే డిమాండ్‌తో వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో భూనిర్వాసితులు చేపట్టిన దీక్ష ఆదివారం మూడోరోజుకు చేరింది. భూ నిర్వాసితులకు సంఘీభావంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆదివారం సాయంత్రం వారితోపాటు దీక్షలో కూర్చున్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తోట ముత్యాలు, మాజీ ఎంపీపీ మోహన్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు

కొండపాక(గజ్వేల్): దాతృత్వం కలిగి ఉండడం గొప్ప విషయమని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల హైస్కూల్లో తల్లిదండ్రులు లేని 22 మంది విద్యార్థులకు క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. అనాథ పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందించేలా కృషి చేయాలన్నారు. 18 ఏళ్లుగా సామాజిక సేవలో ఉన్న క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్, సభ్యులు దుండిగల్ల లింగం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

బెజ్జంకి(సిద్దిపేట): ఐఎంఏ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆవో గావ్ చలే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోటపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగారావు ప్రారంభించారు. సుమారు 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, అనీల్ కుమార్‌రెడ్డి, పవిత్రరెడ్డి, శివకుమార్, నీలిమ, తిరుణాధర్, జావలిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



ఆలయ కమిటీ సభ్యులతో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతాయని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలం ధర్మారం దుర్గామాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాలకు ప్రతాప్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అదేవిధంగా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ముదిరాజ్‌ల జోలికి వస్తే ఊరుకోం



జగదేవ్‌పూర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కొమురవెల్లి: అయినాపూర్‌లో..



సిద్దిపేటరూరల్: నారాయణరావుపేటలో..

కొమురవెల్లి(సిద్దిపేట): ముదిరాజ్‌ల జోలికి వస్తే ఊరుకోమని మత్స్యకార్మిక సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని హెచ్చరించారు. ముదిరాజ్ కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం అయినాపూర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తేలు నర్సింహులు, ఉల్లంపల్లి సాయిలు, సున్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: కౌశిక్‌రెడ్డి అహంకార మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తా వద్ద ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, రాములు, స్వామి, సురేందర్, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.


జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, అంబేడ్కర్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై కృష్ణమూర్తికి ఫిర్యాదుపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, పరమేశ్వర్, మహేశ్, భిక్షపతి, జయమ్మ, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): కోహెడలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో రాజమల్లయ్య, సతీశ్, కనకరాజ్, సత్తయ్య, కనకయ్య, అంజయ్య, శ్రీకాంత్, యాదగిరి, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ముదిరాజ్ మహాసభల మిరుదొడ్డి మండల అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుతారీ నర్సింలు, నాయకులు భైరయ్య తదితరులున్నారు.

సిద్దిపేటకమాన్: కౌశిక్‌రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి ఊరేగింపుతో ఆదివారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రీనివాస్, హేమంత్, లక్ష్మయ్య, కనకయ్య, రవి, బాలు, రాజు, భాను తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



డాక్టర్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రావురూకుల గ్రామానికి చెందిన బండి శ్రీకాంత్ ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందటంతో ఆదివారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, యువకులు శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. హైడ్రోబయోలజీ అండ్ ఫిష్ ఫన్ ఇన్ సిద్దిపేట అంశంపై(ఫిజికో, కెమికో పారామీటర్స్, జూప్లాంక్టన్ ప్రభావం) వంటి వాటిపై 5 సంవత్సరాల పరిశోధనకు గాను ఆయన పీహెచ్‌డీ పొందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ డాక్టరేట్ పొందడం సంతోషంగా ఉందన్నారు. శ్రీకాంత్‌ను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితరవీందర్, ఉద్యోగ సంఘ ప్రతినిధులు పరశురాములు, రంజిత్, రాజు, శ్రీకాంత్, యాదగిరి, శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులతో నేవా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నీలకంఠ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(నేవా) సిద్దిపేట ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న పట్టణానికి చెందిన 65 మంది విద్యార్థులకు ఆదివారం బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీలకంఠ సమాజ గౌరవ అధ్యక్షుడు కడవేర్గు నర్సింలు, అధ్యక్షులు గుండ్ల యోగేశ్వర్, లోక లక్ష్మీరాజం, గుండ్ల జనార్దన్, కడవేర్గు శ్రీనివాస్, అబ్బతిని సురేశ్, శ్రీకాంత్, అసోసియేషన్ అధ్యక్షుడు వీరబత్తిని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండ్ల వేణుమాధవ్, కోశాధికారి వీరబత్తిని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం, జేఏసీ ఆధ్వర్యంలో సంబురాలు



బాణాసంచా కాల్చుతున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన కూతురు పేరుపై రిజిస్ట్రేషన్ చేసిన పెద్ద చెరువు మత్తడి వద్ద ఉన్న పశువుల సంత స్థలాన్ని తిరిగి చేర్యాల మున్సిపాలిటీకి అప్పగిస్తానని ఎమ్మెల్యే కూతురు తుల్జాభవానిరెడ్డి ప్రకటించడంపై పట్టణ కేంద్రంలో పాత బస్టాండ్ వద్ద అఖిలపక్షం, మత్తడి పరిరక్షణ సమితి, జేఏసీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం, మత్తడి పరిరక్షణ సమితి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని షిరిడీ సాయిబాబా ఆలయ నూతన పాలకవర్గాన్ని ఆదివారం భక్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుబిరె మల్లేశం, గౌరవ అధ్యక్షుడిగా ఆలయ నిర్మాత రాచకొండ తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షులుగా రావుల నర్సయ్య, బొనగం రాజేశంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా చీపురుశెట్టి మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బొనగం లక్ష్మీనారాయణగౌడ్, గుడ్ల మోహన్, కోశాధికారిగా పుల్లూరి ప్రభాకర్, సలహాదారుడిగా పత్తి సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చెన్న మహేశ్, ఐలేని వెంకటనర్సయ్య, ఐలేని మల్లారెడ్డి, ఐలేని నర్సింహారెడ్డి, పుర్మ సుధీర్‌రెడ్డి, నార్ల భూమలింగం, కమటం కరుణాకర్, కొండేటి మహేందర్, బండి అనీల్‌యాదవ్, భరత్‌సింగ్, దేవిశెట్టి సాయిప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని భూంపల్లి గ్రామానికి చెందిన బొల్లు ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య ఆదివారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల మరణించిన కుంట నర్సవ్వ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు.

దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో దుబ్బాక మండలం గంభీర్‌పూర్, పెద్దచీకోడ్ గ్రామాలకు చెందిన సుమారు 60 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాజిరెడ్డి, భరత్, నరేందర్ రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, నాగరాజ్, చంద్రశేఖర్, ఉపేందర్, సుకుమార్, తదితరులున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంపై పోరాటాలు



జెండా ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

హుస్నాబాద్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధమని అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ)జిల్లా నాయకుడు గడిపె సుజిత్ అన్నాడు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐఎస్‌బీ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ సమస్యలకు నిలయంగా మార్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అరుణ్, సృజన్, అరవింద్, అఖిల్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆకునూరు కమిటీ ఎన్నిక



కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జేఏసీ గ్రామ కమిటీల ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని ఆకునూరులో జేఏసీ నాయకుడు అందె అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కన్వీనర్‌గా వెలుగుల రఘువీర్, కో–కన్వీనర్లుగా సూర రాజు, శిగుల్ల బాల్‌రాజు, అజీముద్దీన్, పెంటపర్తి లింగారెడ్డి, సలహాదారులుగా టీ.వి.నారాయణ, బోయిని బాలయ్య, భూమని బాల్‌రాజు, స్వర్గం శ్రీకాంత్, అహ్మద్, పోరండ్ల కృష్ణమూర్తి, తాటికొండ బాలాచారి, శిగుల్ల కొమురయ్య, పందిళ్ల యాదగిరి, మండేపల్లి సమ్మయ్య, ఉడుత ఐలయ్య, నాగమల్ల సాయికుమార్, హైమద్, కన్నేమైన శ్రీనివాస్, మెడబోయిన రాములు, జంబుల వెంకట్‌రెడ్డి, కడారి మల్లయ్య, సుంచు సంజయ్, అమరగొండ నర్సింహులు, రామచంద్రం, మరో 35 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకుడు అంజయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

నంగునూరు(సిద్దిపేట): తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని రిటైర్డు ఉపాధ్యాయుడు నరసింహాస్వామి పూర్వ విద్యార్థులకు సూచించారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, నరసింహాస్వామి, ఎల్లంకి రామచంద్రారెడ్డి, అక్కేనపల్లి వెంకట్రామిరెడ్డిలను శాలువాతో సత్కరించిమెమొంటోలు అందజేశారు.



రిటైర్డు ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మినీ ట్యాంక్ బండ్ పనులు వెంటనే పూర్తిచేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలోని ఊర చెరువు వద్ద చేపట్టిన మినీ ట్యాంక్ బండ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఊర చెరువును సందర్శించారు. పనులు చేపట్టి మూడేళ్లు అయినా కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపించారు. వీటితో పాటు బెజ్జంకి అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, ప్రభాకర్, డీవీ రావు, రాజేందర్, పాల్గొన్నారు.